క్లుప్తంగా

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

తిరువూరు: తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం అరుణాచలానికి తిరువూరు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు ఈ నెల 12న ఏర్పాటు చేశామని తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం తెలిపారు. 12న సాయంత్రం ఐదు గంటలకు తిరువూరు నుంచి బయలుదేరి 13న శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం రాత్రికి అరుణాచలం చేరుతుందన్నారు. 14న ఉదయం తిరిగి బయలుదేరి కంచి తిరుత్తణి, శ్రీకాళహస్తి దేవాలయాల దర్శనం అనంతరం 15వ తేదీ రాత్రికి తిరువూరు చేరుతుందని చెప్పారు. తిరువూరు నుంచి రానుపోను ఒక్కొక్కరికి రూ.2,800 టికెట్ ధర నిర్ణయించామన్నారు. ఆన్‌లైన్‌లో అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ టికెట్లు పొందవచ్చని చెప్పారు.

296 మందికి వైద్య పరీక్షలు



తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలనులో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు, నేత్ర, దంత సంబంధిత వ్యాధిగ్రస్తులకు శిబిరంలో వైద్యులు పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. 296 మంది రోగులకు వైద్య సేవలందించామని సత్యసాయి సేవా సంస్థ సభ్యులు శ్రీనివాసరావు, రంగారెడ్డి, నరసింహారావు, హనుమంతరావు తెలిపారు. వైద్యులు ఏవీఎస్‌కే ప్రసాద్, ఎం. సత్యనారాయణ, శ్రీనివాస బహదూర్ రోగులను పరీక్షించారు.

మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ 5వ స్టేజ్ వాటర్ ప్లాంట్ ట్యాంక్‌లో ఊపిరాడక మృతి చెందిన పెయింటింగ్ వర్కర్ బుర్ర ప్రసాద్ కుటుంబానికి వర్క్‌మేన్ కాంపన్సేషన్ చట్టం పరిధిలో రూ.25 లక్షల నష్టపరిహారం వారి కుటుంబానికి చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. మహేష్ ఎన్టీటీపీఎస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వరుస ప్రమాదాలతో కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా నివారణ చర్యలు తీసుకోవడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కొన్ని నెలల క్రితమే కోల్డ్ ప్లాంట్ బాయిలర్ బ్లాస్ట్ అయ్యి ఉద్యోగులు, కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయని గుర్తుచేశారు. భద్రత ప్రమాణాలు పాటించకపోవడంతోనే ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టీటీపీఎస్ ప్రమాదాలపై ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ సమగ్ర విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

8న లోక్ అదాలత్

తిరువూరు: లోక్ అదాలత్ కార్యక్రమం ఈనెల 8వ తేదీన తిరువూరు కోర్టులో జరుగుతుందని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. తిరువూరు పోలీసుస్టేషను పరిధిలో నమోదైన 498ఏ, రోడ్డు ప్రమాదాలు, కొట్లాట కేసులు ఈ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. నూతన 85 బీఎస్ఎస్ చట్టం ప్రకారం నమోదైన కేసులలో మాత్రం రాజీ కుదిరే అవకాశం లేదని చెప్పారు. లోక్ అదాలత్‌లో రాజీ పడదలచినవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

9న దాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలో పునర్నిర్మించిన పాటిమీద దాసాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 9న జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. గత ఏడాది ఫిబ్రవరిలో ఆలయ పునర్నిర్మాణం సుమారు రూ.కోటి వ్యయంతో చేపట్టగా, పలువురు భక్తులు విరాళాలు అందజేశారు.

500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



చాట్రాయి: సారా తయారీ కేంద్రాలపై ఆదివారం దాడి చేశామని నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ ఈశ్వరావు తెలిపారు. పోతనపల్లిలో సారా తయారు చేస్తున్నారని సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశారు. 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పరారైన భరోతు భిక్షాలుపై కేసు నమోదు చేశారు.

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలనులో సారా బట్టీలపై తిరువూరు ఎక్సైజ్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. పెనుగొలను సమీపంలోని మిట్టగుట్ట వద్ద చెరువు ఎడమ గట్టుపై సారా కాయడానికి సిద్ధం చేసిన వెయ్యి లీటర్ల బెల్లపు ఊట, 50 కిలోల బెల్లంను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు శ్రీనివాస్ తెలిపారు.

అవశేషాలను కాల్చితే అనర్థాలే!

- పంటల అవశేషాలను దహనం చేస్తున్న రైతులు
- సారం కోల్పోతున్న భూమి
- రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్న అధికారులు



వెంకటాపురం గ్రామ శివారులో పత్తి పంట అవశేషాలను సాగు భూమిలోనే కుప్పలు వేసి కాల్చివేస్తున్న రైతులు

జి.కొండూరు: ఖరీఫ్, రబీ సాగు ఏదైనా పంట పూర్తయిన తర్వాత పంట అవశేషాలను రైతులు దహనం చేయడం అలవాటుగా మారింది. అవశేషాలను దహనం చేయడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఈ విధంగా చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించడంతో పాటు భూమిలో అనేక మార్పులు జరిగి భూమి సారం కోల్పోతోంది. ఇప్పటికే రసాయనిక ఎరువుల వాడకం అధికం కావడం వల్ల భూమి సారం కోల్పోతుండగా అవశేషాలను కాల్చడం వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈ అవశేషాలను భూమిలో కలియదున్నడం వల్ల భూమి సారం పెరిగి తదుపరి పంటలో అధిక దిగుబడి పొందే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

మైలవరం నియోజకవర్గంలో ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న, మిరప పంటలు సాగువుతుండగా 90 శాతం మంది రైతులు గత పంటల అవశేషాలను కాల్చివేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఖరీఫ్ వరి, పత్తి పంటలు పూర్తి కావడంతో ఈ రెండు పంటల అవశేషాలను రైతులు యథేచ్ఛగా కాల్చివేస్తున్నారు. వ్యవసాయ శాఖాధికారులు గతంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఇప్పుడు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. నియోజకవర్గంలో జి.కొండూరు 12,800 హెక్టార్లు, మైలవరం 8,800 హెక్టార్లు, రెడ్డిగూడెం 13,600 హెక్టార్లు, ఇబ్రహీంపట్నం 3,200హెక్టార్లు, విజయవాడ రూరల్ పరిధిలో 2,800 హెక్టార్ల వ్యవసాయ భూమి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి 14,989 హెక్టార్లలో సాగు చేయగా 4,467 హెక్టార్లలో పత్తి సాగు చేశారు. ఈ రెండు పంటల సాగు ప్రస్తుతం పూర్తి కావడంతో కొంతమేర రబీలో వరి, మొక్కజొన్న సాగు చేయగా మిగిలిన రైతులు పంటల అవశేషాలను సాగు భూముల్లోనే కాల్చివేసి వచ్చే ఏడాది ఖరీఫ్ పంటకు భూమిని సిద్ధం చేసుకుంటున్నారు.

కలియదున్నితే భూసారం పెరుగుతుంది



పంటల అవశేషాలను రైతులు భూమిలో కలియదున్నాలి. అవశేషాలు కుళ్లిపోయి ఆ తర్వాత సాగు చేసే పంటకు మంచి ఎరువుగా ఉపయోగపడుతుంది. సేంద్రియ ఎరువుల వల్ల భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడులు లభిస్తాయి. దీని వల్ల ఎరువుల వాడకం, పెట్టుబడులు తగ్గుతాయి. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చు.

– ఎం.రాంకుమార్, వ్యవసాయాధికారి, జి.కొండూరు మండలం

కలియదున్నితే మేలు..

పంటల అవశేషాలను భూమిలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బనం పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. పూర్వం రైతులు పంట అవశేషాలను భూమిలో కలియదున్నే వారు. దీని ఫలితంగా అవి కుళ్లిపోయి తర్వాతి పంటకు మంచి ఎరువుగా మారేవి. కాల క్రమేణ రైతులు ఈ పద్ధతికి స్వస్తి చెప్పి పంటల అవశేషాలను పొలంలోనే తగలబెట్టడం అలవాటుగా మార్చుకున్నారు.

పంటల అవశేషాలను కాల్చడం వల్ల తలెత్తే అనర్థాలు..

- ★ నేల స్వాభావిక లక్షణాలు మారిపోతాయి.
- ★ భూమిలోని సేంద్రియ కర్బనం తగ్గిపోతుంది .
- ★ భూసారం తగ్గిపోవడంతో పరోక్షంగా దిగుబడులు తగ్గిపోతాయి.
- ★ నేలలో తేమ శాతం గణనీయంగా తగ్గిపోతుంది.
- ★ నేలలో ఆమ్ల గుణం తగ్గిపోతుంది.
- ★ పర్యావరణ కాలుష్యం పెరిగి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది.
- ★ భూసారం దాదాపు పూర్తిగా తగ్గిపోతుంది. ఫలితంగా అధిక మోతాదులో రసాయన ఎరువులు వినియోగించాల్సి వస్తుంది. దీని వల్ల నేల సమతుల్యత దెబ్బ తింటుంది.
- ★ అవశేషాలను కాల్చడం వల్ల భూమి పొరల్లో పంటకు, నేలకు మేలు చేసే కొన్ని వేల రకాల సూక్ష్మజీవులు నశించిపోతాయి.

దీనివల్ల రైతులకు తెలియకుండానే భూమికి అనేక విధాల నష్టం కలుగుతోంది. పంటల అవశేషాలకు నిప్పు పెట్టడం వల్ల తర్వాత సాగు చేయబోయే పంటలకు నష్టం వాటిల్లడమే కాకుండా వాతావరణ కాలుష్యం, అగ్ని ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. ఇటీవల ఈ తరహా ఘటనలు అధికమవుతున్నాయి.

భళారే.. బాలోత్సవం

- అలరించిన జానపద, శాస్త్రీయ నృత్యాలు
- విచిత్ర వేషధారణలతో చిన్నారుల సందడి



జానపద గీతానికి నృత్యం చేస్తున్న విద్యార్థినులు



కోలాట ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

నూజివీడు: ఓవైపు జానపద, శాస్త్రీయ నృత్యాలు, సినిమా పాటలు.. మరోవైపు ఆలోచింపజేసే రచనలు, క్విజ్ పోటీలు, లఘు నాటికలు, ఫ్యాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణలు.. ఇంకోవైపు సందేశాత్మక గీతాలాపనలు, ఏకపాత్రాభినయాలు, కోలాట ప్రదర్శనలు, సందేశాత్మక పాటలకు నృత్యాలు. ఇలా ఒకటా, రెండా పలు పోటీల్లో బాలబాలికలు ఉప్పొంగే ఉత్సాహంతో పాల్గొన్నారు. చిన్నారుల ప్రతిభకు సభికుల నుంచి హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. తొలిసారిగా నూజివీడు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సారథి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఆదివారం బాలోత్సవం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, పట్టణం నుంచి సుమారు వెయ్యి మంది బాలబాలికలు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆకట్టుకునే వేషధారణలో హాజరై వారి ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల జానపద గీతాలాపన, నృత్యాలు ఉర్రూతలూగించాయి. విద్యార్థుల కేరింతలతో కళాశాల ప్రాంగణం మార్మోగింది. పలు ప్రదర్శనలు విద్యార్థుల సృజనాత్మకతకు, ప్రతిభకు నిలువుటద్దంగా నిలిచాయి. ముగింపు కార్యక్రమంలో విజేతలకు, పాల్గొన్న విద్యార్థులకు నూజివీడు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. బాలోత్సవం కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బీఎల్‌బీ కోటేశ్వరి, కాసాని గాంగేయుడు, అకడమిక్ అంశాల ఇన్‌చార్జి డి. మోహన్‌రావు, కల్చరల్ అంశాల ఇన్‌చార్జి కె. శిఖాఆకాష్, నిర్వహణ కార్యదర్శి ఎస్‌కేఎం సుభాని, నిర్వాహకులు నండూరి హనుమాన్లు, ఏకేడీ ప్రసాద్, జి. రాజు, పద్మాంజలి పాల్గొన్నారు.

200 పని దినాలు కల్పించాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు



పోరాట నగర్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

మైలవరం: ఉపాధి హామీ కూలీలకు 200 పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ. 700 కూలీ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మైలవరం మండలం పోరాట నగర్‌లో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించి ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ నిధుల కేటాయింపులో కోత పెట్టడం, కేటాయిస్తున్న అర కొర నిధులను దారి మళ్లించి సంబంధం లేని పనులకు వినియోగించడం వంటి చర్యలు గమనిస్తుంటే ఉపాధి హామీ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాతరేస్తున్నట్లుగా ఉందని విమర్శించారు. గత పదేళ్లుగా పథకానికి క్రమేణా నిధులు తగ్గిస్తూ, కేటాయించిన అరకొర నిధులు కూడా సీసీ రోడ్లు, వ్యవసాయానికి అనుసంధానం పేరుతో యంత్రాలతో పనిచేయిస్తూ కూలీలకు పనిలేకుండా చేయడంతో గ్రామీణ నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పని చేయగలిగిన వారికి జాబ్ కార్డులు ఇవ్వకుండా, ఉన్న జాబ్ కార్డులు కూడా తగ్గించడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య నాయకులు బాణోతు పెదబాలు నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆంగోతు చిన్నా నాయక్, భూక్యా మోటో, కారుమూరి రత్నకుమారి, బసవాని కుమారి, పి. దాసు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా బావి

మండల పరిధిలోని కోడూరు గ్రామంలో ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న పాడుబడిన బావి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. దశాబ్దాల కిందట తవ్విన ఈ బావి గ్రామస్తులకు ఎన్నో ఏళ్ల పాటు నీటి అవసరాలను తీర్చింది. క్రమేపీ భూమిలో నీటి మట్టం తగ్గడంతో ఈ బావిలో నీరులేక ఎండిపోయింది. ఈ క్రమంలో ఈ బావి పక్కనే బోరు వేయించి చేతి పంపును సైతం ఏర్పాటు చేశారు. అయితే ఈ బావిని మాత్రం పూడ్చకుండా వదిలేశారు. ప్రస్తుతం ఈ బావి రహదారికి ఆనుకుని నేల మట్టానికి ఉండటంతో వాహనదారులు అదుపు తప్పితే బావిలో పడే అవకాశం ఉంది. అంతే కాకుండా ఈ బావికి సమీపంలో రహదారికి రెండవ వైపున ప్రభుత్వ పాఠశాల ఉండటంతో పిల్లలు ఆడుకుంటూ వచ్చి బావిలో పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి బావిని పూడ్చాలని, లేకుంటే బావిపై ఇనుప తడికెను అమర్చాలను గ్రామస్తులు కోరుతున్నారు.

– జి.కొండూరు

ఎస్‌బీఐలో హౌసింగ్ లోన్ మేళా



హౌసింగ్ లోన్ మంజూరు పత్రాలు అందజేస్తున్న అధికారులు

తిరువూరు: స్థానిక భారతీయ స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచి, రాజుపేట వ్యవసాయాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో హౌసింగ్ లోన్ మేళా ఆదివారం జరిగింది. బ్యాంకు విజయవాడ నార్త్ రీజినల్ మేనేజరు రాఘవరావు, చీఫ్ మేనేజరు టీఆర్‌టీ ప్రసాద్‌లు రుణ దరఖాస్తులు పరిశీలించి అర్హులకు మంజూరు పత్రాలు అందజేశారు. సోమవారం కూడా మేళా కొనసాగుతుందని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి మేనేజరు రవికుమార్ తెలిపారు. రాజుపేట బ్రాంచి మేనేజరు శ్రీనివాస్, ఫీల్డు సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను ఆశీర్వదించిన జోగి రమేష్



చిన్నారులను ఆశీర్వదిస్తున్న జోగి రమేష్, ప్రజాప్రతినిధులు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): కొటికలపూడి సర్పంచి రెంటపల్లి నాగరాజు కుమార్తె, కుమరుడు వర్షిత, ప్రశాంత్‌లను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వకర్త జోగి రమేష్ ఆశీర్వదించారు. గ్రామంలో ఆదివారం జరిగిన నూతన వస్త్రాల బహూకరణ వేడుకలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పాల్గొని చిన్నారులకు దీవెనలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, జి.కొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, నియోజకవర్గ సీనియర్ నాయకులు సర్నాల తిరుపతిరావు, సర్పంచి నెలకుర్తి ఆశాలత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, వార్డు కౌన్సిలర్ జోగి రాము, ఎంపీటీసీలు రంగస్వామి, సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



మైలవరం: మైలవరానికి చెందిన పెండెం నరసింహరాజు జనవరి 14న ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కుటుంబానికి ఆధారమైన మగదిక్కును కోల్పోయిన రాజు కుటుంబీకులకు పూర్వ విద్యార్థులు స్థానిక ఆదాంపురం సంఘం పెద్ద కోడిరెక్కల రవికుమార్ సమక్షంలో రూ.18,500 ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎ.నాగేశ్వరరావు, మోహన్‌రావు, ప్రసాద్, బాలవర్ధన్, నాగరాజు, వెంకటేశ్వరరెడ్డి, రఘు, బాలగోవర్ధన్, జమలయ్య, ఇస్లావత్ స్వామి, బి. రవి పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

నూజివీడు: మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని పట్టణ సీఐ పి. సత్యశ్రీనివాస్ అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందని చెప్పారు. మహిళలకు భద్రతతో పాటు, వారి ఆరోగ్య సంరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. వైద్య శిబిరంలో గైనిక్, జనరల్ మెడిసిన్, శరీర బరువును నియంత్రించుట, రక్తపోటు, మధుమేహానికి సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పోలీసు సిబ్బంది, వైద్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

CHANGE OF SURNAME

I, **LOKESWARI KETHE** (Old Name), W/o. **SURESH KUMAR** resident of D.No. 24-256, Employees Colony, Nuzvid, Eluru District, A.P. - 521201. I have changed my name as **LOKESWARI KETTE** (New Name). W/o. **SURESH KUMAR.** Hereafter my name is known as **LOKESWARI KETTE** (New Name), W/o. **SURESH KUMAR.**

CHANGE OF SURNAME

We, **SURESH KUMAR KETTE** and **LOKESWARI KETTE** residents of D.No. 24-256, Employees Colony, Nuzvid, Eluru District, A.P. - 521201. We have a daughter named **SAI RAM SATYA POORVIKA NAASYA KETHE** (Old Name). We have changed our daughter name as **SAI RAM SATYA POORVIKA NAASYA KETTE** (New Name). Hereafter our daughter name is known as **SAI RAM SATYA POORVIKA NAASYA KETTE** (New Name).

CHANGE OF SURNAME

I, **SURESH KUMAR KETHE** (Old Name), S/o. **SATYANARAYANA,** resident of D.No. 24-256, Employees Colony, Nuzvid, Eluru District, A.P. - 521201. I have changed my name as **SURESH KUMAR KETTE** (New Name). S/o. **SATYANARAYANA.** Hereafter my name is known as **SURESH KUMAR KETTE** (New Name), S/o. **SATYANARAYANA.**

జోరుగా మద్యం అక్రమ విక్రయాలు



తిరువూరు సర్కిల్లో బెల్టు దుకాణాల్లో స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు (ఫైల్)



విస్సన్నపేటలో అనధికారిక మద్యం నిల్వలున్న దుకాణానికి సీలు వేసిన ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

- తిరువూరు నియోజకవర్గంలో 550 బెల్టుషాపులు
- మొక్కుబడిగా దాడులు చేస్తున్న అధికారులు
- లైసెన్స్‌డ్ దుకాణాల్లో అనధికారిక బార్లు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో అనధికారిక మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం అధికారికంగా మంజూరు చేసిన 16 దుకాణాలుండగా, ప్రతి మండలంలో 150కి పైగా బెల్టు దుకాణాలను వాటికి అనుబంధంగా నడుపుతున్నారు. బెల్టు దుకాణాలను నామరూపాలు లేకుండా చేస్తామని ప్రభుత్వం ప్రకటించగా, తదనుగుణంగా ఇటీవల తిరువూరు ఎమ్మెల్యే సైతం బెల్టు షాపులను నిర్మూలిస్తానని బహిరంగంగా హెచ్చరించారు. ఎక్సైజ్ అధికారులు సైతం అధికారిక మద్యం దుకాణాల నుంచి బెల్టు షాపులకు మద్యం సీసాలు తరలుతున్నట్లు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

సీసాకు రూ.15 అదనం

గ్రామాల్లోని బెల్టు దుకాణాల్లో మద్యం సీసాపై రూ.15 అదనపు ధర వసూలు చేస్తున్నారు. బడ్డీ కొట్లు, కూల్‌డ్రింకు షాపులలో బహిరంగంగానే మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నివాస గృహాల నడుమ ఉన్న దుకాణాల్లో మద్యం అమ్మకాలు జరుగుతుండటంతో రోజువారీ కూలీలు, పేదలు మద్యానికి బానిసలవుతున్నారు. లైసెన్సుడు మద్యం దుకాణాల పరిధిలోని బెల్టు షాపులలో అనధికారిక అమ్మకాలు జరుగుతున్న వైనంపై పలుమార్లు ఆయా గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేసిన అధికారులు ఇటీవల కొన్ని గ్రామాల్లో మాత్రమే దాడులు జరిపారు. గంపలగూడెం మండలంలోని ఊటుకూరు, దుందిరాలపాడు, గంపలగూడెం, ఉమ్మడ దేవరపల్లి, కొత్తపల్లి, విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లి, చంద్రుపట్ల, పుట్రేల, విస్సన్నపేటలలో బెల్టు దుకాణాల్లో 100 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

లైసెన్స్‌డ్ దుకాణాల్లోనే సిట్టింగ్ రూములు

లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల్లో లూజ్ సేల్స్‌కు అనుమతి లేకపోయినా తిరువూరు నియోజకవర్గంలోని అన్ని దుకాణాల్లో మద్యం సేవించడానికి ఏర్పాట్లు చేశారు. దుకాణాల పక్కనే బహిరంగ ప్రదేశాలు, రహదారులపై మద్యం సేవిస్తుండటంతో మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తిరువూరులోని ఫ్యాక్టరీ సెంటర్, బస్టాండు సెంటర్లలో మద్యం దుకాణాలను ఊరి వెలుపలకు తరలించాలని పలువురు కోరినా అధికారులు స్పందించడం లేదు.

దాడులు చేస్తున్నాం

బెల్టు దుకాణాల నిరోధానికి దాడులు చేస్తున్నాం. గ్రామాల్లో తెలంగాణ నుంచి వచ్చే మద్యం కట్టడితో పాటు అనధికారిక మద్యం అమ్మకాల నిరోధానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్

లారీని ఢీకొట్టి రోడ్డుకు అడ్డంగా తిరిగిన కారు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): కారు, లారీ స్వల్పంగా ఢీకొన్న ఘటన మూలపాడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు.. లారీని ఓవర్‌టేక్ చేయబోయింది. అదుపు తప్పిన కారు లారీ ముందు భాగాన్ని ఢీకొని రోడ్డుకు అడ్డంగా తిరిగింది. లారీ డ్రైవర్ షడన్ బ్రేక్ వేయడంతో కారుపైకి లారీ దూసుకుపోకుండా ఆగింది. ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పొంచి ఉన్న ప్రమాదం



జి.కొండూరు: హెచ్.ముత్యాలంపాడు గ్రామంలో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు అత్యంత ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. వాటర్ ట్యాంకును ఆనుకొని అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉండడంతో ఏ క్షణంలో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు ఉన్న సమయంలో వాటర్ ట్యాంకు కూలితే ప్రాణనష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున వెంటనే ట్యాంకును కూల్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ వాటర్ ట్యాంకు వినియోగంలో కూడా లేనందున అధికారులు స్పందించి వెంటనే కూల్చివేత చర్యలను చేపట్టాలని కోరుతున్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తిరువూరు డివిజన్

99510 20399 (తిరువూరు),
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)

Office mail : sakshiads@gmail.com